క్లుప్తంగా

కర్నూలులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి బొకే అందజేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ మౌర్య

కర్నూలు (టౌన్): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 352 వ ఆరాధనోత్సవాల్లో పాల్గొనేందుకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి కర్నూలుకు వచ్చారు. స్థానిక బి.క్యాంపులోని అతిథి గృహం వద్ద జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు రేంజ్ డీఐజీ ఎస్. సెంథిల్ కుమార్, జిల్లా ఎస్పీ క్రిష్ణకాంత్, సెబ్ అడిషనల్ ఎస్పీ క్రిష్ణకాంత్ పటేలు బొకే అందజేసి స్వాగతం పలికారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన వారిలో మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్‌ఓ నాగేశ్వరరావు, ఆర్డీఓ హరిప్రసాద్ ఉన్నారు. అనంతరం ఆయన కర్నూలు నుంచి మంత్రాలయానికి బయలుదేరి వెళ్లారు.

కలెక్టరేట్‌లో విరిగిపడిన చెట్టు కొమ్మ

- తప్పిన పెను ప్రమాదం



విరిగిపడిన చెట్టు కొమ్మ

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సమాచార భవన్‌కు వెళ్లే దారిలో ఉన్న ఓ చెట్టు కొమ్మ విరిగిపడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, గాలులకు ఈ చెట్టు కొమ్మ విరిగింది. అదే సమయంలో చెట్టు కింద మినరల్ వాటర్ ప్లాంట్ దగ్గర వ్యక్తులు ఉన్నారు. అయితే, వారికి ఏమి కాలేదు. కలెక్టరేట్‌కు వచ్చి వెళ్లే వారికి ఇబ్బందిలేకుండా పడిపోయిన చెట్టుకొమ్మను తొలగించారు.


మంత్రి రాజన్న దొరపై ఆరోపణలు చేస్తే సహించం

కర్నూలు(అర్బన్): అనునిత్యం గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప అన్నారు. టీడీపీ నేతలకు నీతి నిజాయితీ ఉంటే రూ.118 కోట్లు దిగమింగి ఐటీ అధికారులకు దొరికిన గజదొంగ చంద్రబాబు అవినీతి గురించి సమాధానం చెప్పాలన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజనులను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చేయాలని తపిస్తున్న రాజన్నదొరపై కొందరు టీడీపీ నేతలు తమ స్థాయికి మించి విమర్శలు చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పాలనలో గిరిజనాభివృద్ధి గుర్తుకు రాలేదా అని ఆ పార్టీ నాయకులను ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎంతో పారదర్శకంగా గిరిజనాభివృద్ధికి కృషి చేస్తుంటే రాజన్న దొరను నైతికంగా దెబ్బ తీయాలని టీడీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారన్నారు.

బీజేపీలో వణుకు

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ బలోపేతమవుతుండడంతో బీజేపీలో వణుకు పుట్టిందని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు విమర్శించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో డీసీసీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లాలోనూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషిచేస్తున్నామన్నారు. ప్రతి కార్యకర్త రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధర రూ.500ఉందని, ఇప్పుడు మోదీ రూ.950కి తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణగుప్తా, జాన్ విల్సన్, బజారన్న, దేవిశెట్టి ప్రకాష్, దామోదరం రాధాకృష్ణ, లక్ష్మీనారాయణ, కాశంవలి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కేఎంసీ ఫిల్లింగ్ స్టేషన్ ట్రయల్ రన్ పరిశీలన



ఫిల్లింగ్ స్టేషన్ ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలో ఏర్పాటు చేసిన ఫిల్లింగ్ స్టేషన్‌ను సోమవారం ట్రయల్ రన్ నిర్వహించారు. అనంతరం నగరపాలక కమిషన్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ త్వరలోనే ఈ ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ ప్రభుత్వ గ్యారెంటీతో పెట్రోల్, డీజిల్, లూబ్రికెంట్లు అందుబాటులో ఉంటాయన్నారు. స్టేషన్‌లో ఉచితంగా ఎయిర్ చెక్, నైట్రోజన్ గ్యాస్ ఫిల్లింగ్ వినియోగదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వానజల్లు



కొండారెడ్డిబురుజు వద్ద..



గొడుగు సాయంతో..



సెంట్రల్ ప్లాజా సమీపంలో కురుస్తున్న వర్షం

నిన్నటి వరకు వేసవికాలాన్ని తలపించిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కర్నూలు నగరంలో ఎడతెరిపి లేకుండా సోమవారం ఉదయం నుంచి జల్లులు పడుతున్నాయి. ఈ వర్షంలోనే నగరవాసులు తమ ప్రయాణాలు సాగిస్తున్న దృశ్యాలివీ..

సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

రేపు చిన్ని కృష్ణుల వేషధారణ పోటీలు

కర్నూలు కల్చరల్: భరత మాత మాతృ మండలి ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు మండలి అధ్యక్షురాలు పద్మావతి పేర్కొన్నారు. సోమవారం మండలి కార్యాలయంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృ మండలి ఆధ్వర్యంలో గత 26 సంవత్సరాల నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేడుకలు జరుగుతాయన్నారు. విద్యార్థి దశ నుంచే భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు నృత్య పోటీలు, బాలగోకులం, చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణ పోటీలు ఉంటాయన్నారు. గోపూజ, ఉట్లోత్సవం, చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద ప్రవచనం ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 5వ తేదీ సాయంత్రంలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 94925 50433, 99665 15684 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలి సభ్యులు జయలక్ష్మి, స్వప్న, రజనీ కల్యాణ, అనురాధ, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

- స్పందన కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు(టౌన్): ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవతేజ అన్నారు.సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఆయన వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మీనా కుమారి, మేనేజర్ చిన్నరాముడు, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

స్పందనకు వచ్చిన సమస్యలివే...

- వార్తా ఆఫీస్ నుంచి హౌసింగ్ బోర్డుకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతినిందని, త్వరగా కొత్త రోడ్లు వేయాలని జొహరాపురం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మహబూబ్ బాషా, ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన మెహమూద్ బేగం వేర్వేరు వినతిపత్రాల్లో అభ్యర్థించారు.
- తమ వీధిలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ప్రకాష్‌నగర్‌కు చెందిన డాక్టర్ శ్రీరామ్ ప్రసన్న, మారుతీ నగర్‌కు చెందిన రామకృష్ణుడు, చాణక్యపురి కాలనీకి చెందిన డాక్టర్ దాసరి వేర్వేరు వినతి పత్రాల్లో విన్నవించారు.
- తమ వీధిలోని ఖాళీ స్థలంలో రాజీవ్ గృహకల్ప, డ్రైవర్స్ కాలనీకి చెందిన మురుగునీరు రావడం వల్ల దోమల సమస్య ఎక్కువైందని రాయలసీమ గ్రామీణ బ్యాంక్ ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీకి చెందిన శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు.
- ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ నుంచి శ్రీరామనగర్‌ను కలుపుతూ రహదారిని ఏర్పాటు చేయాలని అదే కాలనీకి చెందిన రాజన్న విన్నవించారు.
- టిడ్కో ఇంటి కోసం చెల్లించిన రుణాన్ని వాపసు ఇప్పించాలని పాతబస్తీకి చెందిన నూర్ అహ్మద్ కోరారు.

ఉద్యోగాలు రాకుండా అన్యాయం చేశారు



మాట్లాడుతున్న ముబీనా, షహనాపర్వీన్

కర్నూలు(హాస్పిటల్): తమకు రావాల్సిన ఉద్యోగాలను అర్హతలేని వారికిచ్చి అన్యాయం చేశారని పలువురు ఫార్మాసిస్టులు ఆరోపించారు. సోమవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ఫార్మసి అభ్యర్థినులు ముబీనా, షహనా మాట్లాడుతూ డీసీహెచ్ఎస్‌లో ఫార్మాసిస్టు పోస్టుల భర్తీలో భాగంగా తాము దరఖాస్తు చేసుకున్నామన్నారు. ఫైనల్ మెరిట్‌లిస్ట్‌లో తమకు వరుసగా 26, 17 ర్యాంకులు వచ్చాయని, కానీ మాకంటే అధిక ర్యాంకు ఉన్న వారికి పోస్టులు కట్టబెట్టారని విమర్శించారు. ఇదేమని డీఎంహెచ్‌ఓను అడిగితే డీసీహెచ్ఎస్‌ను అడగాలని చెప్పారని, డీసీహెచ్ఎస్‌ను అడిగితే పోస్టుల భర్తీ, మెరిట్‌లిస్ట్ విడుదల చేసింది వైద్య ఆరోగ్యశాఖ అని అక్కడే అడగాలని వారు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత క్లర్క్‌ను అడిగితే ఆ సమయంలో మీరు హాజరుకాలేదని, అందుకే ఇతరులకు ఇవ్వాల్సి వచ్చిందని చెబుతున్నారన్నారు. తమకు ఎవ్వరూ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ఫోన్ చేయలేదని, వివరాలు ఆన్‌లైన్‌లో కూడా పెట్టకుండా పోస్టులు భర్తీ చేశారని వారు ఆరోపించారు. అనంతరం ఈ విషయమై వారు స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కర్నూలు(సెంట్రల్): పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..నరేంద్రమోదీ కార్పొరేటర్లకు వత్తాసు పలుకుతూ సామాన్య ప్రజలపై తీవ్ర భారాలు మోపుతున్నారన్నారు. ఒక వైపు నిత్యం నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతుండడంతో సామాన్యుడి నడ్డి విరుగుతోందన్నారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ మన దేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరుగుతూనే పోతున్నాయన్నారు. మరోవైపు కరెంట్, రవాణ చార్జీలు పెరిగిపోతుండడంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మోదీ అధికారంలోకి వస్తే 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈ.పుల్లారెడ్డి, ఎం.నాగరాజు, అలివేలమ్మ, విజయ్, సుధాకరప్ప, నరసింహులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉర్దూ వర్సిటీ పాలకమండలి సభ్యురాలు



అజ్రా జావేద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు (సెంట్రల్): ఉర్దూ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలిగా నూతనంగా ఎన్నికైన ఉస్మానియా కళాశాల కరస్పాండెంట్ అజ్రా జావేద్ సోమవారం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ఆమెను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మొయిజ్ ఖాన్, ప్రిన్సిపాల్ సమీవుద్దీన్ పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి శ్రీకృష్ణ జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్: శ్రీకృష్ణ జయంతి వేడుకలను ఈనెల 6, 7తేదీల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. వేడుకలను పురస్కరించుకుని శ్రీకృష్ణ వేషధారణలు వేయించడం, ఉట్టి కొట్టే కార్యక్రమాలు, భక్తులతో నగర సంకీర్తన, శోభాయాత్రలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకృష్ణ జీవితం గురించి ప్రవచనం చెప్పించాలని సూచించారు. శ్రీకృష్ణుని భజనలు, శ్రీకృష్ణ అష్టకం, గోపూజలు నిర్వహించి మన సంస్కృతి సంప్రదాయాలను భావి తరాలకు అందించాలని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

కల్లూరు : రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని కల్లూరు అర్బన్ జేసీఎస్ ఇన్‌చార్జ్ కన్వీనర్ పి.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ మహేశ్వరరెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేపు వీహెచ్‌పీ షష్ట్యబ్ది ఉత్సవాల బహిరంగ సభ

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) షష్ట్యబ్ది ఉత్సవాల ప్రారంభ కార్యక్రమం ఈనెల 6వ తేదీ కర్నూలు నగరంలో జరుగుతుందని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి పేర్కొన్నారు. ఉత్సవాల ప్రారంభ కార్యక్రమానికి వీహెచ్‌పీ అంతర్జాతీయ ప్రధాన (కేంద్రీయ ప్రధాన కార్యదర్శి) కార్యదర్శి మిలింద్ పరాండే హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు రెవెన్యూ కాలనీలోని వీహెచ్‌పీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం, షష్ట్యబ్ది ఉత్సవాల ప్రారంభ కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

కర్నూలు(సెంట్రల్): నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సచివాలయాల కార్యదర్శులకు వినతులు ఇచ్చే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఐదో రోజు నగరంలోని 19,20 వార్డుల పరిధిలోని 47,48,49,50,51, ,52,53 సచివాలయాల కార్యదర్శులకు సీపీఎం నాయకులు మాలిక్ ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

రైతు ఉద్యమాల్లో రామకృష్ణకు ప్రత్యేక స్థానం

కర్నూలు(సెంట్రల్): రైతు ఉద్యమాల్లో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు రామకృష్ణకు ప్రత్యేక స్థానం ఉందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో టి.రామకృష్ణ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంజనేయులు, మృత్యుంజయుడు, హుస్సేన్, అయ్యన్న, మధు, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు (అర్బన్) : సాంకేతిక సమస్యల కారణంగా మంగళవారం నగరంలోని పలు కాలనీల్లో విద్యుత్ కోతలు ఉండనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఈఈ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ వార్త, నందికొట్కూరు, నన్నూరు, 11కేవీ సి.క్యాంప్ ఫీడర్ల పరిధిలోని గణేష్ నగర్, శ్రీరాం నగర్, రెవెన్యూ కాలనీ, పోస్టల్ కాలనీ, జయరాం నగర్, చెక్‌పోస్టు ఏరియా, ఫోర్త్ క్లాస్ కాలనీ, ధనలక్ష్మి నగర్, మారుతీ మెగాసిటీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోతలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా షాకీర్ హుసేన్

కర్నూలు(టౌన్) : నగరపాలక ఇంజినీరింగ్ విభాగంలో ఇన్‌చార్జ్ ఈఈగా పనిచేస్తున్న షాకీర్ హుసేన్‌కు రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం రాత్రి 585 జీవో ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే నంద్యాల మున్సిపాలిటీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న రాధాకృష్ణకు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతి కల్పించి ఆదోని మున్సిపాలిటీకి బదిలీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో చేపట్టిన పదోన్నతుల్లో ఉమ్మడి జిల్లా నుంచి వీరిరువురికీ అవకాశం లభించింది.

వైద్యులు సమయపాలన పాటించాలి



ఫిమేల్ మెడికల్ వార్డులో వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా విభాగాల్లో అవసరమైన ట్రాలీ, ఐవీ స్టాండ్‌లను వెంటనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఓల్డ్ ఫిమేల్ మెడికల్ వార్డును పరిశీలించిన అనంతరం అక్కడున్న పరిస్థితుల గురించి ఆరా తీశారు. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్, పైకప్పు మరమ్మతులు, టాయ్‌లెట్/బాత్‌రూమ్‌లు, విద్యుత్ మరమ్మతులు, సివిల్ పనులను సత్వరమే ప్రారంభించాలని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలోని డంప్‌యార్డ్ ప్రదేశాన్ని సందర్శించి వ్యర్థాలను నిల్వ చేసేందుకు అవసరమైన డంప్‌యార్డును ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆర్థోపెడిక్ విభాగం వద్ద కొందరు రోగులు వచ్చి వైద్యులు మధ్యాహ్నం 12.30 గంటలకే ఓపీ మూసేస్తున్నారని సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆర్థోపెడిక్ హెచ్‌వోడీతో మాట్లాడి వైద్యులు సమయపాలన పాటించాలని, ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఓపీ నిర్వహించాలని చెప్పారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌పై విచారణ

స్టేషనరీ బిల్లుల అవకతవకలపై ఆసుపత్రి జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుపై సోమవారం విచారణ ప్రారంభమైంది. ఇందులో భాగంగా కేఎంసీ ఏడీ అనిల్‌కుమార్ రెడ్డి, క్యాన్సర్ హెచ్ఓడీ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ విచారణ చేపట్టారు. కార్యాలయ ఏడీ రమేష్‌బాబు, క్లర్క్ శ్రీనివాసులును వారు విచారణ చేశారు. స్టేషనరీ విభాగంలోని పలు రికార్డులు, బిల్లులు పరిశీలించారు. విచారణను త్వరగా పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని వారిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి కోరారు.

8 నుంచి విద్య, వైజ్ఞానిక తరగతులు

కర్నూలు సిటీ: ఈ నెల 8,9, 10 తేదీల్లో తిరుపతి నగరంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్య, వైజ్ఞానిక తరగతులు జరుగనున్నాయి. ఈ తరగతులకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం క్లస్టర్ యూనివర్సిటీలో వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ చేతుల మీదుగా విడుదల చేయించారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు మాట్లాడుతూ విద్య, వైజ్ఞానిక తరగతులకు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రమణకుమార్, అస్లాం, వీరేష్, రెహానా, సునీత, ప్రసాద్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.